www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 15 మే 2025





మహానాడు ఏర్పాట్లపై విజయవాడలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి లోకేష్‌తో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

గళం విప్పేనా?

- రబీపై లోతైన చర్చ అవసరం
- సిపిడబ్ల్యూ టెండర్లపై పట్టుబట్టేనా
- కదలని ఉక్కు పరిశ్రమ పనులు
- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ఎదుర్కొంటున్న సమస్యలపై లోతుగా చర్చించడంపై సందేహం నెలకొంది. ఈనెల ఏడున నిర్వహించాల్సిన సమావేశం కేబినెట్ కారణంగా వాయిదా పడింది గురువారం నిర్వహించే సమావేశంలో ఖరీఫ్ సీజన్‌లో రైతాంగం ఎదుర్కొంటున్న నకిలీ విత్తన నివారణ, అన్నదాతా సుఖీభవ నిధుల జమ, క్రాప్ ఇన్సూరెన్స్ వంటి సమస్యలపై దృష్టి సారించాల్సి ఉంది. వ్యవసాయ, పారిశ్రామిక. సాగునీటి పారుదల, విద్య, వైద్య రంగాలు ఎదుర్కొంటున్న ప్రతికూలతలు జిల్లా ప్రగతిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. జిజిహెచ్ సూపర్‌స్పెషాలిటీ, క్యాన్సర్ విభాగాలకు వైద్య నిపుణులు, నర్సింగ్ సిబ్బంది, టెక్నీషియన్స్ కొరతపై దృష్టి సారించాలి. ఉక్కు పరిశ్రమ, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ నిర్మాణ పనులపై చర్చించాల్సి ఉంది. కొప్పర్తి పైప్‌లైన్ పనుల పురోగతిని ఆరా తీయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలోని 24 సిపిడబ్ల్యూ స్కీముల టెండర్ల ఓపెన్‌పై అధికార పార్టీ ఏకపక్షంపై నిలదీయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ఏడాది మార్చి నుంచి గాలివాన బీభత్సం ధాటికి వాటిల్లిన రూ.నాలుగు కోట్ల మేరకు ఉద్యాన పంటల నష్టాలకు పరిహారం అందని ద్రాక్షను తలపిస్తోంది. జిల్లా రైతాంగం నకిలీ విత్తన సమస్యతో సతమతమవుతోంది. ఖరీఫ్ ప్రధాన ఆహార పంటలు వరి, వేరుశనగ. వీటితోపాటు ఉద్యాన పంటలైన అరటి, చీనీ, టమోటా ధరలు గణనీయంగా పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. బడ్జెట్‌లో ప్రతిపాదించిన గిట్టుబాటు ధరల స్థిరీకరణ నిధి సహాయంతో ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలో సుమారు 3.16 లక్షల ఎకరాల్లో సాగు చేయడం తెలిసిందే. ప్రధాన పంటల దిగుబడులతోపాటు మార్కెట్లో ధరల తగ్గుదల ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయడంపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉరుముతోంది. అన్నదాత సుఖీభవ, తల్లికివందనం, ఫీజురియింబర్స్‌మెంట్ జమ చేయడంపై నిలదీయాల్సిన అవసరం ఉంది. వైద్య రంగానికి వస్తే జిజిహెచ్ సూపర్ స్పెషాలిటీ, క్యాన్సర్ విభాగాలకు వైద్యనిపుణులు, ఓంగ్ సిబ్బంది, ఆధునిక పరికరాల ఆపరేటర్ల నియామకం వంటి అంశాలపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ, శ్రీనివాసపురం రిజర్వాయర్ల పనులను పూర్తి చేయాల్సి ఉంది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2, హెచ్ఎన్ఎస్ కాలువల పనులకు మోక్షమెప్పుడో తేలాల్సి ఉంది. కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో దేవుని కడప రహదారి విస్తరణ పెండింగ్, నాలుగు స్టోమ్ డ్రెయిన్ పనుల పురోగతి ప్రశ్నార్థంకగా మారింది. గండికోట, సోమశిల, పైడిపాలెం నిర్వాసితుల మొరను ఆలకించాలి. సర్వరాయ సాగర్, బ్రహ్మసాగర్, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిధిలోని లింగాల కాల్వ లీకేజీ, యురేనియం పైప్‌లైన్ పనుల నత్తనడకను సమీక్షించాలి. వేసవి సీజన్‌లో యురేనియం వ్యర్థాల నిర్వహణలోని టెయిల్ పాండ్ పటిష్టతను సమీక్షించాల్సి ఉంది. యర్రబల్లి-పార్నపల్లి పైప్‌లైన్ పనుల ఆలస్యం కారణంగా యురేనియం నిర్వాసిత గ్రామాలకు తాగునీటి సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందో తెలియలేదు. ఉక్కు పరిశ్రమ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో ఉక్కు పనుల పురోగతిపై సందేహం నెలకొంది. 2019 సార్వత్రిక ఎన్నికల ముంగిట తాము అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ వైఫల్యం శాపంగా మారింది. 2024 ప్రథమార్థంలో జెఎస్‌డబ్ల్యూ చేపట్టిన ఉక్కు పరిశ్రమ పనుల్లో ఎటువంటి కదలిక కనిపించడం లేదు. ఐసిడిఎస్ పరిధిలోని పలు అంగన్వాడీ కేంద్రాలు అద్దెభవనాల్లో మగ్గుతున్నాయి. ఐసిడిఎస్ అంగన్వాడీ భవన నిర్మాణాలను చేపట్టడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. జడ్‌పి నిధుల నుంచి చేపడతామన్నా ముందుకురాని పరిస్థితి నెలకొంది. జడ్‌పి పాలకవర్గం జిల్లా సమగ్రాభివృద్ధిపై సమగ్రమైన చర్చ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మేయర్ సురేష్‌బాబుపై అనర్హత వేటు!

- యాక్టు-1955 ఉల్లంఘన పేరిట తొలగింపు
- రూ.36 లక్షలు స్వాహాపై సీరియస్
- జిఒఆర్‌టి 446 విడుదల



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మేయర్ కె.సురేష్‌బాబుపై అనర్హత వేటు పడింది. ప్రభుత్వం జిఒఆర్‌టి నెంబర్ 446 జారీ చేసింది. వివరాల్లోకి వెళ్తే...1955 మున్సిపల్ యాక్టును ఉల్లంఘిస్తూ వర్ధిని కన్‌స్ట్రక్షన్ అనే కుటుంబ సభ్యుల పేరిట నమోదైన కాంట్రాక్టు కన్‌స్ట్రక్షన్ చేపట్టిన రూ.36 లక్షల రహదారులు, ఇతర అభివృద్ధి పనుల్ని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తప్పు బట్టింది. మున్సిపల్ యాక్టు-1955 ప్రకారం మేయర్ వంటి స్థానిక సంస్థల పదవుల్లో నియమితులైన నాయకులు, కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట ఎలాంటి కాంట్రాక్టు పనులను చేపట్టకూడదని నిర్దేశిస్తోంది. నిబంధనల్ని ఉల్లంఘిస్తూ తన కుటుంబ సభ్యుల పేరిట నమోదైన వర్ధిని కన్‌స్ట్రక్షన్ సంస్థ కడప కార్పొరేషన్ పరిధిలో 10 రకాల కాంట్రాక్టు పనుల్ని చేపట్టింది. ఏడు పనుల్ని పూర్తి చేసింది. మరో మూడు పనులు పెండింగ్ దశలో ఉన్నాయి. రూ.36 లక్షల విలువైన పలు రహదారులు, ఇతర అభివృద్ధి పనుల్ని చేపట్టడంపై అధికార పార్టీకి చెందిన కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి ఆరోపిస్తూ ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై రాష్ట్ర మున్సిపల్ అడ్మిస్ట్రేషన్ అధికార యంత్రాంగం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ విచారణలో రూ.36 లక్షల దుర్వినియోగం చేసినట్లు నిర్ధారించింది. మున్సిపల్ యాక్టు-1955 ఉల్లంఘనపై సమాధానం చెప్పాలని కోరుతూ పలు మార్లు నోటీసులు జారీ చేసింది. నోటీసులను సవాల్ చేస్తూ మేయర్ హైకోర్టును ఆశ్రయించారు. మున్సిపల్ అడ్మి నిస్ట్రేషన్ రాష్ట్ర అధికారులు ఈ ఏడాది ఫిబ్రవరి 28న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ అప్రైసాల్ రిపోర్టును నివేదించింది. మార్చి ఎనిమిదిన వ్యవహారం హైకోర్టుకు చేరింది. 24న షోకాజ్ నోటీసు కింద మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు మెమో జారీ చేశారు. ప్రభుత్వం ఏప్రిల్ 22న మెమో జారీ చేసింది. దీనిపై హైకోర్టులో రిట్ వేయడం, అనంతరం ప్రభుత్వం ఈనెల తొమ్మిదిన మెమో జారీ చేసింది. ప్రభుత్వం మేయర్‌ను పదవి నుంచి తొలగిస్తూ జిఒఆర్‌టి 446 జారీ చేసింది. ప్రభుత్వం మేయర్‌ను తొలగించడంపై చర్చనీయాంశంగా మారింది.

విధుల పట్ల నిర్లక్ష్యం తగదు

జోనల్ మలేరియా అధికారి డాక్టర్ కె.లక్ష్మ నాయక్



మాట్లాడుతున్న జోనల్ మలేరియా అధికారి లక్ష్మ నాయక్

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

విదుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ కె.లక్ష్మ నాయక్ పేర్కొన్నారు. బుధవారం చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందిర్శంచారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కీటక జనిత వ్యాధుల నియంత్రణకై చేపడుతున్న వివిధ కార్యక్రమాలను సమీక్షించారు. అనంతరం ఆయన రక్తపరీక్షల విభాగాన్ని సందర్శించి రికార్డులను, రిపోర్టులను తనికీ చేశారు.. గణాంకాలు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. విధులపట్ల ఉద్యోగులు నిర్లక్ష్యంవహిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో నిర్దేశించిన మేరకు రక్తపూతల సేకరణ జరిపి పరీక్షల నిమిత్తం పంపాలని తెలిపారు. అనంతరం ఆయన ప్రజలతో మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధి వంటి వ్యాధుల గురించి అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. మనం ఎక్కడ పడితే అక్కడ టీ కప్పులు, టెంకాయ చిప్పలు, పాత టయర్ల, ఉపయోగించని పాత్రలు, రోళ్ల వేయడంవల్ల అందులో వర్షపునీరు చేరి అందులో దోమలు గుడ్లు పెడతాయని తెలిపారు. ఈ వ్యాధులను కలిగించే దోమలు నిల్వఉన్న నీటిలో తడవకు రెండువందల గుడ్లు పెడుతాయని అలానే తన జీవితకాలంలో వేయి నుండి రెండువేల గుడ్లు పెడతాయని పేర్కొన్నారు. అందువల్ల అవి గుడ్లు పెట్టకుండా చేయగలిగితే మనం వాటిని ప్రాథమిక దశలోని నియంత్రించవచ్చని తెలియచేశారు. అప్పటి సాధ్యం కాకపొతే అవి లార్వాలుగా మారతాయని కనీసం ఈ దశలోనైనా మనం వాటిని అరికట్టుకోవాలని తెలిపారు. వారానికి ఒకసారి డ్రైడే పాటించాలని తెలియచేశారు. గ్రామాల్లో మురుగు కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయడంవల్ల లార్వాల గాలిగొట్టం మూసుకుపోయి అవి మరణిస్తాయని తెలిపారు. దోమలుగా రూపాంతరం చెందితే ప్రజలు దోమతెరలు వాడి దోమకాటుకు గురికాకుండా కాపాడుకోవాలని తెలిపారు. తమ విభాగం లార్వాల నియంత్రణకు నీటి కుంటల్లో గంబూషియా చేపలు వదలుతుందని పేర్కొన్నారు. చింతకొమ్మదిన్నె ప్రజలు సహకరించి వందశాతం విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న స్థానిక వైద్యులు డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ సునీతలను అభినందించారు. కార్యక్రమంలో సమాజ ఆరోగ్య అధికారి సుకుమారన్, పర్యవేక్షకులు జనార్దన్, జయరత్నమ్మ , స్టాఫ్ నర్స్ ఫ్లోరెన్స్ ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం అనర్థాలపై అవగాహన కల్పించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప

మద్యం తాగడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా శ్రీధర్ చెరుకూరి ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధ్వర్యంలో కేర్ (కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్)కార్యక్రమంపై ఎస్‌పి అశోక్ కుమార్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ఆల్కహాల్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో కేర్ కమిటీ ఏర్పాటయిందన్నారు. ప్రతి మద్యపాన వినియోగదారునికి వాటి వల్ల కలిగే అనారోగ్య సమస్యలను తెలియజేసేలా మద్యం షాపుల్లో పాంప్లెట్లు అందజేయాలని అధికారులకు సూచించారు. బాధ్యతాయుతమైన మద్యపాన వినియోగంపై అవగాహన సదస్సులు, చర్చా గోష్టులు, ప్రదర్శనలు చేపట్టాలన్నారు. ఆల్కహాల్ సంబంధిత చట్టాల గురించి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో మద్యపాన వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. మైనర్లకు మద్యం విక్రయిస్తే మద్యం షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆస్పత్రులలో ఆల్కహాల్ సంబంధిత ఆరోగ్య సమస్యలపై జిల్లా ఆరోగ్యశాఖ అవగాహన సెమినార్లు నిర్వహించాలన్నారు. డి అడిక్షన్ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్‌తో పాటు వారిలో మార్పు తేవాలని సూచిచారు. పాఠశాల, కళాశాలలో ఆల్కహాల్ వ్యతిరేక అవగాహన తరగతులు నిర్వహించాలన్నారు. యువతలో ఆల్కహాల్ దుష్ప్రభాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఎస్‌పి మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాలలో అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మద్యపాన వినియోగం వల్ల కలిగే ఆనారోగ్య, సామాజిక, ఆర్థిక దుష్ప్రభావాలను వివరించాలని అన్నారు. మద్యపానం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా కమిట్మెంట్‌తో అధికారులు పనిచేయాలన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులపై గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్. రవికుమార్, డిఇఒ షంషుద్దీన్, జిల్లా విద్యా ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ డాక్టర్ హిమాదేవి, సూపరిటెండెంట్ ఆఫ్ సైక్రియాటిస్ట్ డాక్టర్ వెంకట రాముడు, జనరల్ హాస్పిటల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ జమున, మనబంధు ఫౌండేషన్ శివారెడ్డి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ రామచంద్రారెడ్డి,ఎక్సైజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి విగ్రహప్రతిష్టాపన

హాజరైన డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణరెడ్డి

ప్రజాశక్తి-అట్లూరు



విగ్రహ ప్రతిష్టాపనలో డిసిసిబి చైర్మన్

మండల కేంద్రం లోని బద్వేల్ - కడప ప్రధాన రహ దారి కుంభగిరి మెయిన్ రోడ్డు ఆర్చి వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మి నర సింహ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టపన కార్యక్రమం వైభవంగా నిర్వహిచారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిసిసి బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి హాజరయ్యారు. ఆయన్ను ఆలయ పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన్ను ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తపుమునిరెడ్డి, అట్లూరు మండల క్రియాశీల నాయకులు అరవ శ్రీనివాసులు రెడ్డి, ఎంపీపీ ఇంచార్జ్ పోతిరెడ్డి రెడ్డయ్య, కుంభగిరి గ్రామ పంచాయితీ పాలకొండు. రాజశేఖర్ రెడ్డి, లక్కిరెడ్డి నారాయణరెడ్డి, జెసిబి సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ పాలకొండు.రాజారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, నాయకులు, తెలుగు యువత అధ్యక్షులు బోవిళ్ల జయకృష్ణారెడ్డి, నర్సారెడ్డి, చిలిపి కృష్ణారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, పరుశురాముడు, కోటపాటి పెంచలయ్య, ఈశ్వరయ్య శ్రీకాంత్‌రెడ్డి, గురు ప్రసాద్ రెడ్డి గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

'మహానాడు'కు పటిష్ట బందోబస్తు : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఈ నెల 27, 28, 29లలో నిర్వహించబోయే 'మహానాడు' సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎస్‌పి పలు అంశాలపై పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. 'మహానాడు' కు పలువురు వివిఐపిలు, విఐపిలు, పెద్ద ఎత్తున ప్రజలు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ పరంగా ఎటువంటి అవాంతరాలు లేకుండా తీసు కోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. పోలీస్ అధికారులకు కేటాయించిన విధులను అప్రమత్తంగా ఉంటూ నిర్వర్తించాలన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

24, 25న కథా వసంతం-2కె25 : జెవివి

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పిల్లల కథా రచనలో సృజనాత్మకతను పెంచేందుకు కథా వర్కషాప్‌ను 'కథా వసంతం-2కె25' పేరుతో ఈనెల 24, 25 తేదీలలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ , ఉపాధ్యక్షులు వేంపల్లి రాజశేఖర్ తెలిపారు. బుధవారం కథా వసంతం పోస్టర్‌ను స్థానిక జెవివి కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో కథల పట్ల ఆసక్తి , వారి రచన నైపుణ్యాలను పెంచేందుకు వర్క్ షాప్ ఉపయోగపడుతుందని అన్నారు. 10 నుంచి 16 ఏళ్లలోపు ఉన్న పిల్లలకు ఈ కార్యక్రమంలో కథలు ఎలా రాయాలి, రాసే క్రమంలో ఏయే అంశాలు ఉండాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేస్తామన్నారు. పిల్లలను వారి తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. ఆసక్తి కల్గిన పిల్లలు 9705432038, 970533330 5కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకో వాలని వారి విజ్ఞప్తి చేశారు. కథా వర్క్ షాప్ రెండు రోజులు స్థానిక శివాలయం పక్కనున్న నందిని క్లాత్ మార్కెట్‌లోని జెవివి ఆఫీసులో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కవి మహమ్మద్, జెవివి జిల్లా గౌరవ సలహాదారులు గోపీనాథ్ రెడ్డి, నాయకులు ఈశ్వరయ్య ,మధుసూదన్ రెడ్డి దేవానంద్, శిరీష, హాసిని ,జుబేదా, గురు,చందన సోయబ్, భరత్, నరసింహ గురు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -వేంపల్లె

దళిత భూములను కబ్జా చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంఆర్ పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అలిరెడ్డిపల్లెలో కజ్జాకు గురైన దళిత భూములను ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి శేఖర్ దళిత నాయకులతో కలిసి పరిశీలించారు. బాధిత దళిత రైతుతో చర్చించారు. తహశీల్దార్‌ను కలిసి దళిత భూములను అగ్రవర్ణాలకు చెందిన వారు కజ్జా చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకొని దళితులకు న్యాయం చేయాలని కోరారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

- జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహూల్, వీరపోగు రవి

ప్రజాశక్తి - కడప అర్బన్

అన్నమయ్య జిల్లా మదనపల్లె లో ఈ 17 నుంచి 26 వరకు నిర్వహించే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి పిలుపునిచ్చారు. బుధవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య రంగ సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం పై పోరాటానికి శ్రీకారం చుట్టాలని, అందుకు ప్రణాళిక ఏర్పాటు చేయడం కోసం మదనపల్లె రాష్టం వేదిక కాబోతుందని తెలిపారు. రాష్ట్ర శిక్షణ తరగతులకు అన్ని జిల్లాల నుంచి 450 మంది ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు హాజరు అవుతున్నారని చెప్పారు. 10 రోజులు ఈ శిక్షణా తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. క్లాస్‌లకు రాష్ట్రంలోని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, విద్యావేత్తలు హాజరవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో వచ్చిన 10 నెలలు పూర్తి చేసుకున్న సందర్భంలో రాష్ట్ర విద్యా రంగంలో రోజురోజుకీ విద్యార్థులు సమస్యలు పుట్టుగొడుగుల పుట్టుకొస్తున్నాయని చెప్పారు. ఉన్నత విద్యలో డిగ్రీ మేజర్ మైనర్ సబ్జెక్టులు తీసుకు వచ్చిన పద్ధతిని రద్దు చేయాలని, పీజీ విద్యార్థులు స్కాలర్షిప్ ఎగొట్టేందుకు తీసుకువచ్చిన 77 జీవోను రద్దు చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని, శిథిలా వ్యవస్థలో ఉన్నటువంటి సంక్షేమ హాస్టల్స్ ను పునః ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజ శేఖర్, సహాయ కార్యదర్శి అజయ్, నగర ఉపాధ్యక్షులు శ్రీను పాల్గొన్నారు.

ఆర్‌టిపిపి సిఇగా వాసుదేవరావు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల



పుష్పగుచ్చం అందజేస్తున్న ఉద్యోగులు

మండల పరిధిలోని ఆర్‌టిపిపిలో నూతన సిఇగా వాసుదేవరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గంలో సిఇగా విధులు నిర్వహిస్తున్న గౌరీపతి విద్యుత్ సౌధకు బదిలీపై వెళ్లారు. పీలేరులో విధులు నిర్వహిస్తున్న వాసుదేవరావు ఇక్కడికి వచ్చారు. ఎస్ఇలు సోమశేఖర్ రెడ్డి, కృష్ణమోహన్ స్థానిక ఉన్నతాధికారులు ఉద్యోగులు నూతన సిఇకి ఘన స్వాగతం పలికారు. ఆర్‌టిపిపిలోని యూనియన్ నాయకులు సిఇని కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పండ్ల తోటలను సాగు చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు :పండ్ల తోటల పెంపకం పై రైతులకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ వీర కిషోర్ తెలిపారు. బుధవారం స్థానిక మండల సభా భవనంలో ఉపాధి, వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ద్వారా ఉద్యానవన పంటలకు అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని రైతులకు తెలియజేసి సాగు చేసేలా కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ కింద మూడు సంవత్సరాల వరకు సాగు ఖర్చులు చెల్లిస్తారన్నారు. వ్యవసాయ అధికారి మ్యాగీ మాట్లాడుతూ మండలంల ఉద్యానవన పంటల వైపు రైతులను మళ్లించాలని తెలియజేశారు.

కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి కడప అర్బన్ : నగరంలోని ఇండస్ట్రీలో అనేక పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు సరైన సౌకర్యాలు, మౌలిక సౌకర్యాలు కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఇండస్ట్రీ ఏరియాలో అనేక పరిశ్రమలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పరిశ్రమల్లో సరైన సౌకర్యాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. సరైన సౌకర్యాలు లేక గతంలో కార్మికులు చనిపోయారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఇండస్ట్రీ అధికారులు ఇండస్ట్రీలపై ఎంక్వయిరీ చేసి మౌలిక సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. సరైన మౌలిక సౌకర్యాలు కనీస వేతనం ఇవ్వన్నటువంటి పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కొన్ని పరిశ్రమలు కనీస వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్ సరిగ్గా కట్టడం లేదన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి బీహార్, ఒరిస్సా కార్మికులను తీసుకొచ్చి ఎక్కువ పని గంటలు, తక్కువ వేతనంతో చాకిరి చేయించుకుంటారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, పిఎఫ్, ఈఎస్ఐ, మౌలిక సౌకర్యాలు సౌకర్యాలు కల్పించి కార్మికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని పేర్కొన్నారు.

పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి - కడప : పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని పాస్టర్ పి. మహేష్ అన్నారు. ప్రస్తుత కాలంలో పిల్లలపై గారాబంగా ప్రేమ చూపుతూ పెద్దల పట్ల గౌరవం, దైవ భక్తి, క్రమశిక్షణ పిల్లలకు నేర్పించడంలో తల్లిదండ్రులు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కడప నగరం 48వ డివిజన్ కృపా కాలనీలో ఉన్న న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ చర్చిలో బుధవారం పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ ల ఆధ్వర్యంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతపె సదస్సు ఏర్పాటు చేశారు. దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ పి.మహేష్ మాట్లాడుతూ పిల్లలకు తప్పని సరిగా క్రమశిక్షణ నేర్పించాలన్నారు. మరి ముఖ్యంగా ఈ వేసవి సెలవు దినాలలో పిల్లల కదలికలపై నిఘా ఉంచాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో పి.రవితేజ, శాంతిరాజు, రోజా, నరసయ్య, అల్లూరమ్మ, సుంకమ్మ, అంజినమ్మ, అంజలి, సుగుణమ్మ, దూపం మహేష్ అనేక మంది తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిబిఎస్ఇ ఫలితాల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల హవా

ప్రజాశక్తి కడప అర్బన్



కేక్ కట్ చేస్తున్న టాపర్ అఫ్సన్

సిబిఎస్ఇ ఫలితాల్లో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యా ర్థులు తమ హవా కొనసా గించారు. జిల్లా టాపర్‌గా ఎస్. అఫ్సన్ నిలిచారు. బుధ వారం డైరెక్టర్ వివేకా నందరెడ్డి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినం దించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యా సంస్థల్లో మార్కులే కాకుండా అన్ని రంగాల్లో ప్రావీణ్యం పొందేలా శిక్షణ ఇస్తామని చెప్పారు. జిల్లా టాపర్ నిలిచిన అఫ్సన్ 600 మార్కులకు గాను 557 మార్కులను సాధించారని తెలిపారు. ఐటి విభాగంలో రాయలసీమలో 100 కు 100 మార్కులు సాధించిన ఏకైక విద్యార్థిని ఎస్.అఫ్సన్ అని పేర్కొన్నారు. 100 కు 100 శాతం ఫలితాలు సాధిస్తూ సర్వతోముఖాభి వృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలో ప్రత్యేక విద్యా సంస్థ గా నిలిచిన ఇంటర్నేషల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, కడప అన్నారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యున్నత విలువలతో విద్యను పాఠశాల యాజమాన్యం అందిస్తుందని చెప్పారు. జిల్లా టాపర్‌గా నిలిచిన ఎస్. అఫ్సన్ కడప ఎసిబి సిఐ సయ్యద్ హాసం కుమార్తె అని పేర్కొన్నారు. జిల్లా టాపర్‌తో పాటు ప్రతిభ కనబర్చిన విద్యార్థిని,విద్యార్థులను అభినందించారు. 25 శాతం పైచిలుకు మార్కులు కనబరిచారని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ హరికృష్ణ, ఇన్‌ఛార్జి సంధ్య పాల్గొన్నారు.



విద్యార్థికి ఒఆర్ఎస్ ప్యాకెట్ అందజేస్తున్న అధికారులు

వడగాల్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా

ప్రజాశక్తి - వేంపల్లె

వేసవిలో వీచే వేడీ గాలుల పట్ల విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర –స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వేడిగాలులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణంలో వచ్చే మార్పులతో వేడి గాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. వేడి గాలి వీచినప్పుడు మానవ ఆరోగ్యంపై పడి దుష్ఫలితాలు అధికం వస్తాయాని చెప్పారు. వేడి గాలి వలన శరీరంపై ఒత్తిడి పెరిగి శ్వాసకోశ ,హృదయ సంబంధిత వ్యాధులు, మధుమేహం, మూత్రపిండాల వ్యాధులు వస్తాయని తెలిపారు. కొన్ని సందర్భాలలో ప్రాణాంతకంగా కూడా మారుతాయాని చెప్పారు. కాబట్టి ప్రతి ఒక్కరూ అధిక మోతాదులో కనీసం 3 నుండి 5 లీటర్ల నీటిని రోజూ తాగాలని కోరారు. అ తెల్లని దుస్తులు ధరించడంతో పాటు ఉదయం 10 నుండి సాయంత్రం 4 గంటల వరకు ఇంటిలో ఉండాలని చెప్పారు. అప్పుడప్పుడు ఒఆర్ఎస్ ప్యాకెట్లును నీటిలో కలుపుకొని తాగడం మంచిదని చెప్పారు. వేంపల్లెలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు ఒఆర్ఎస్ ప్యాకెట్లును అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్ రెడ్డి, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

- మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

పట్టణంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని మున్సిపల్ చైర్మన్ మూలే హర్షవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. పట్టణ వాసులకు తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ. 117 కోట్లతో గండికోట రిజర్వాయర్ నుంచి ఎర్రగుంట్ల పట్టణానికి పైప్ లైన్ మంజూర అయిందని చెప్పారు. ఈ పైపులైనులకు నిధులు మంజూరయ్యాయని, త్వరలో టెండర్లు పిలుస్తామని వివరించారు. ఇందులో భాగంగా ప్రకాష్ నగర్ లో, వేంపల్లి రోడ్డులో రెండు ఒహెచ్ఆర్ నీటి ట్యాంకులను పట్టణంలో ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు రోడ్డు లేఅవుట్లలో నూతనంగా రూ. 40 లక్షలతో గ్రావెల్ రోడ్లు వేయించామని అన్నారు. పట్టణంలో 12 వీధులలో పైప్ లైన్, సిమెంట్ రోడ్లు వేయించామని చెప్పారు. ఇటీవల రూ. 3 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. పది కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపామని వివరించారు. ప్రస్తుతం రూ. 8 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషఫణి, కౌన్సిలర్ ఎరికలరెడ్డి, కో – ఆప్షన్ మేంబర్ మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - వల్లూరు

కడప – తాడిపత్రి జాతీయ రహదారి తప్పెట్ల రైల్వే బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనం లారీ ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం పోలీసులు అందించిన సమాచారం మేరకు వల్లూరు మండలం దుగ్గాయి పల్లె పంచాయతీ వెంకటాపురం కాలనీకి చెందిన బాబా ఫక్రుద్దీన్ గా గుర్తించారు. క్షతగాత్రుడు ఉద్యోగరీత కడపకు వెళ్తుండగా కడప నుంచి ఎర్రగుంట్లకు వెళ్తున్న లారీ డీ కొనడంతో ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. క్షతగాత్రుని వైద్యం నిమిత్తం 108 వాహనం ద్వారా కడప రిమ్స్ కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

కారులో చెలరేగిన మంటలు

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు – జమ్మలమడుగు జాతీయ రహదారిలోని ఘాట్ రోడ్డులో బుధవారం తెల్లవారుజామున వెళ్తున్న కారు ఎసిలో మంటలు చెలరేగింది. ఈ సంఘటనలో కారు దగ్దమైంది. వివరాల్లో.. కొండాపురం మండలానికి చెందిన డ్రైవర్ అహ్మద్‌బాషా తన సొంత పని నిమిత్తం ముద్దనూరు మీదుగా నంద్యాలకు బయలుదేరాడు. ముద్దనూరు ఘాట్ రోడ్డులో రాగానే కారు ఎసిలో పొగలు వచ్చాయి. డ్రైవర్ అప్రమత్తమై కారు పక్కకు నిలిపి పరిశీ లిస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. హుటా హుటినా జమ్మల మడుగు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఘటనా వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. అప్పటికే కారు మంటల్లో కాలిపోయింది.

ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం

- మురికి కూపాలుగా రహదారులు
- విధులకు దూరంగా పారిశుధ్య కార్మికులు
- పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్
- కాలువల్లో పూడికలు తీసుకొంటున్న ప్రజలు

ప్రజాశక్తి - వేంపల్లె

పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు 5 నెలలుగా జీతాలు రాక పోవడంతో మురికి కూపాలుగా మారిపోయాయి. చెత్తా చెదారం ఎక్కడ పడితే అక్కడ దర్శనమిస్తున్నాయి కాలువలు పూడిపోవడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దుర్వాసన వెదజల్లడంతో పాటు ప్రజలు నడవలేని పరిస్థితిలో రోడ్లు తయారయ్యాయి. సమస్యను పంచాయతీ అధికారులు తెలియజేసినా ఫలిత లేకపోవడంఓ చేసేది ఏమీ లేక ప్రజలే రంగంలోకి దిగి కాలువల్లో ఉన్న పూడికలను స్వయం తీసుకొంటున్నారు. శ్రీరాంనగర్ వీధిలోని కళాశాల రోడ్డులో ఉన్న కాలువలు చెత్తతో నిండి పోయి మురుగునీరు స్తంభించి రోడ్డుపై నిలిచింది. దీంతో అ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు పరిస్థితిని పలుమార్లు పంచాయతీ అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. పంచాయతీ సిబ్బందికి అధికారులు జీతాలు ఇవ్వక పోవడంతో వారు కొంతకాలంనుంచి విధులకు దూరంగా ఉండడంతో డ్రెయినేజీలో ఉన్న చెత్తను తొలగించే వారు కరువయ్యారు అధికారులపై నమ్మకం లేక పోవడంతో బుధవారం టిడిపికిచెందిన ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో కళాశాల రోడ్డులోని డ్రెయినేజీ కాలువల్లోని పూడికను ప్రజల సహకారంతో తొలగించారు. ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా డ్రెయినేజీ కాలువల్లో ఉన్న చెత్తను తొలగించలేదని, అందుకే అ కాలనీలో ఉన్న వారే స్వయగా పూడికలనచీసుకుంటున్నారని ఈశ్వరయ్య తెలిపారు. రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు పెరిగి పోవడంతో పాటు ప్రజలు రహదారిలో నడపలేక పోతున్నట్లు చెప్పారు. ఇంత అధ్వానంగా ఎన్నడూ చూడలేదని చెప్పారు. పంచాయతీ పాలక మండలి కూడా పట్టించుకోవడం లేదని అన్నారు. కాలువల్లోని చెత్తను తొలగించి రోడ్లపై మురుగునీరు ప్రవహించకుండా చేసి ప్రజలు రోగాల భారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీకి కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించి వారిని విధుల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంత వాసులు కోరుతున్నారు.



వేంపల్లెలోని కళాశాల రోడ్డులో కాలువల్లో పూడికలు తీసుకొంటున్న ప్రజలు

కార్మికులకు తాత్కాలిక ఉపశమనం.. సర్పంచ్ ఆర్థిక సాయం


స్థానిక పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు తాత్కాలికంగా ఉపశమనం లభించింది. సర్పంచ్ ఆర్. శ్రీనివాసులు తన సొంత నిధులను అడ్వాన్స్‌గా రూ. 10 లక్షలు వారికి ఆర్థిక సాయం చేశారు. ఇ ఇన్‌ఛార్జి ఇఒగా ఉన్న పులివెందుల డిఎల్‌పిఒ రమాదేవి ఆధ్వర్యంలో ఒకొక్కరికి రూ. 10 వేల చొప్పున మొత్తం 103 మందికి అందజేశారు. ఈ నెలాఖరులో కార్మికులకు మిగిలిన జీతాలను చెల్లిస్తామని ఆమె హామీ ఇచ్చారు.రూ 10 వేల చొప్పున అడ్వాన్సుగా ఇవ్వడంతో కార్మికులు సర్పచ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

వాటర్ ట్యాంక్ శుభ్రం చేయాలి

- పన్నుల భారం తగ్గించాలి
- మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్
- గైర్హాజరైన కౌన్సిలర్లపై చర్యలు తీసుకుంటాం : కమిషనర్

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

పట్టణంలో నడివూరులో ఉన్న వాటర్ ట్యాంక్‌లో పాచి పట్టిందని, అందులో నీరు తాగలేకపోతున్నామని, వాటర్ ట్యాంక్ చుట్టూ కింద అంతా అపరిశుభ్రంగా ఉందని క్లీన్ చేయించాలని 19వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీ ఈశ్వరి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ శేషఫణి కౌన్సిల్‌సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు అనేక సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. 17వ వార్డు కౌన్సిలర్ ఎరికల రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ ఇంటి, నీటి పన్నులు పెంచుతూ ప్రజలపై భారం వేస్తున్నారని, తగ్గించాలని తెలిపారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ మున్సిపల్ యాక్ట్ ప్రకారం పన్నులు వసూలు చేస్తున్నామని గత ఏడాది 15 శాతం పన్నులు పెరిగాయని చెప్పారు. 6వ కౌన్సిలర్ నాగిరెడ్డి మాట్లాడుతూ క్రాంతి నగర్‌లో విద్యుత్ తీగలు కిందకి ఉండడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని సభలో తెలిపారు. ఇందుకు విద్యుత్ ఎఇ ప్రియ దర్శన్ రెడ్డి స్పందిస్తూ కొత్త లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని మంజూరు అయిన వెంటనే పనులు చేస్తామని తెలిపారు. 20 మంది కౌన్సిలర్లలో కేవలం 9 మంది మాత్రమే హాజరయ్యారు. కౌన్సిల్ సమావేశం ప్రారంభంలో కమిషనర్ మాట్లాడుతూ మూడు సమావేశాలకు హాజరుకాని కౌన్సిలర్ల వివరాలు ఎన్నికల సంఘానికి పంపించడం జరుగుతుందని, చట్టరీత్య వారు చర్యలు తీసుకుంటారని వివరించారు. నీటి సరఫరా, రోడ్లు, డ్రెయినేజీ, వీధి దీపాలు పలు పనుల కోసం రూ.3 కోట్ల పనులకు ఆమోదం తెలిపామని చెప్పారు. రూ. 10. 46 కోట్ల అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపేందుకు సభలో ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ యామిని, వైస్ చైర్మన్లు జై బున్నిసా, చంద్రకళ, కౌన్సిలర్లు పెన్నా రషీద్, సునీత, వెంకట లక్ష్మమ్మ, కో– ఆప్షన్ మేం మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శేషఫణి

13వ వార్డు కౌన్సిలర్ రాజీనామా

పట్టణంలో 13వ వార్డు కౌన్సిలర్ కరీమున్నీసా రాజీనామా చేశారు. మున్సిపల్ కమిషనర్ శేషఫణికి మున్సిపల్ కార్యాలయంలో రాజీనామా పత్రాన్ని అందజేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు తెలిపారు. ఆమె 2021వ సంవత్సరంలో వైసిపి రుపున కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలుపొందారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కౌన్సిలర్ రాజీనామా పట్టణంలో చర్చనీయాంశం అయింది. ఆమె భర్త కోకఖోలా గౌస్ మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డికి ముఖ్య అనుచరుడు.

బెంగళూరు బ్రాడ్ గేజ్ రైల్వే పనులు పూర్తి చేయండి

సిఎంకు తులసిరెడ్డి బహిరంగ లేఖ

ప్రజాశక్తి - వేంపల్లె

జగన్ ప్రభుత్వ పాలనలో ఆగి పోయిన కడప – రాయచోటి మదనపల్లె – బెంగళూరు నూతన బ్రాడ్ గేజ్ రైల్వే పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి కోరారు. బుధవారం కడప – బెంగుళూరు రైల్వే పనులపై ముఖ్యమంత్రికి ఆయన బహిరంగలేఖ రాశారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత రైతులు, వినియోగదారులు, అన్ని వర్గాల ప్రజల సమగ్రాభివృద్ధి కోసం 2008–09 రైలే బడ్జెట్‌లో నాటి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు అనాటి కేంద్రంలోని యుపిఎ ప్రభుత్వం కడప – రాయచోటి – మదన పల్లి – బెంగుళూరు నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గాన్ని మంజూరు చేసిందన్నారు. దీని పొడవు 255.40 కిలో మీటర్లు ఉండగా ఇందులో 205 కిలోమీటర్లు ఆంధ్రప్రదేశ్ లో, మిగిలిన 50.40 కిలోమీటర్లు కర్నాటక రాష్ట్రంలో ఉందన్నారు. నిధులలో 50 శాతం కేంద్ర ప్రభుత్వం, 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించే షరతుతో రైల్వే మార్గం మంజూరైందని చెప్పారు. 2008–09 అంచనాల మేరకు ప్రాజెక్టు వ్యయం రూ 3038 కోట్లు ఉండగా 2010 సెప్టెంబర్ మాసంలో అప్పటి రైల్వే మంత్రి మునియప్ప శంఖు స్థాపన చేశారని చెప్పారు. నాలుగు దశల్లో పని పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ వాటాగా గత కాంగ్రెస్, తెలుగు దేశం ప్రభుత్వాలు రూ 132.39 కోట్లు చెల్లించాయాని చెప్పారు. రాష్ట్రంలో 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఇవ్వాల్సిన నిధులు ఇవ్వని కారణంగా రైల్వే శాఖ పనులు నిలిపి వేసిందని చెప్పారు. రైల్వే లైన్ అవసరం లేదని దీనికి బదులు 72 కిలోమీటర్ల పొడవు గల ముద్దనూరు – పులివెందుల – ముదిగుబ్బ నూతన రైల్వే లైను మంజూరు చేయాలని వైసిప ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందని చెప్పారు. ఇది ప్రగతి నిరోధక చర్య అన్నారు. మంజూరైన ప్రాజెక్టుతో పాటు కొత్త ప్రాజెక్టును మంజూరు చేయమని కోరాలే కానీ మంజూరైన నిధులు రూ 351 కోట్లు ఖర్చు చేసి, 21.80 కిలోమీటర్లు పూర్తి చేసిన ప్రాజెక్టును వద్దని గత జగన్ ప్రభుత్వం చెప్పడం దుర్మార్గం ఆవేదన వ్యకం చేశారుఉ. కూటమి ప్రభుత్వంనైనా పునరాలోచించి కడప – రాయచోటి – మదన పల్లి – బెంగుళూరు నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గానికి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా నిధులను వెంటనే విడుదల చేసి పెండింగ్ లో ఉన్న భూ సేకరణ పనులు వెంటనే చేపట్టాలని కోరారు. రైల్వే శాఖ వెంటనే పనులు పునః ప్రారంభించేటట్లు చూడాలని సిఎంకు తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు..

అంబేద్కర్ సర్కిల్‌గా నామకరణం చేయాలి

ప్రజాశక్తి -చాపాడు (మైదుకూరు)

మైదుకూరు బస్టాండ్, పోలీస్ స్టేషన్ పరిసరాలను రాజకీయ పార్టీలకు అతీతంగా బాబా సాహెబ్ అంబేద్కర్ సర్కిల్‌గా గుర్తించాలని అంబేద్కర్ విగ్రహ కమిటీ నాయకులు ఐతా బాబు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపాలిటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్, హైస్కూల్, ఎంపిడిఒ కార్యాలయం మధ్యలో బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వెలిసిందన్నారు. ఆయన విగ్రహం చుట్టూ భారత దేశ మొదటి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి, నందమూరి తారక రామారావు విగ్రహం కూడా పూర్తి స్థాయి నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. పార్టీలకతీతంగా అంబేద్కర్ కాలనీగా నామకరణం చేయాలన్నారు. కార్యక్రమంలో కైవు భాస్కర్ మాదిగ, విలియం ,నాగార్జున,కనకరాజు , గోపాల్,నర్రా వెంకట సుబ్బయ్య,రాజేష్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

ఈనెల 20న నిర్వహించే సమ్మెను విజయ విజవయంతం చేయాలని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో స్తానిక గఫూర్ డ్రైవింగ్ పాఠశాలలో సమ్మెకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లు రద్దుచేయాలని కోరారు. ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. బ్రిటీష్ వారితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం మోడీ ప్రభుత్వం భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోట్లు తెచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్ల వల్ల కార్పొరేట్ల లాభాలు పెరిగి, కార్మికులు ఏ హక్కులు లేని బానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. 3 నల్ల చట్టలతో రైతులను, 4 లేబర్ కోడ్లలో కార్మికులను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కరోనా సంక్షోభాన్ని, ఉగ్రవాద సంక్షోభ పరిస్థితులను మోడీ మతోన్మాద ఎజెండాను అమలు చేసేందుకు కార్పొరేట్ శక్తులను సంతృప్తి పరిచేందుకు వాడుకుంటుందని వారు విమర్శించారు. ఇటువంటి కార్మిక వ్యతిరేక ప్రజావ్యతిరేక రైతు వ్యతిరేక విధానాలకు సమ్మెల ద్వారా కట్టడి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సమ్మెలో ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసి,పోస్టల్ ,బిఎస్ఎన్ఎల్ పాల్గొంటున్నారని, ప్రభుత్వ పథకాలలో పనిచేసే ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు అందరూ కూడా సమ్మెను బలపరచడం ద్వారా మోడీ కార్పొరేట్ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమంలో సిఐటియు నాయకులు విశ్వనాథ్,హరి శివయ్య,రామాంజనేయులు బాబా ఫక్రుద్దీన్,అశోక్ కుమార్,రమణయ్య పాల్గొన్నారు.

నేడు విద్వాన్ నరసింహులు వర్ధంతి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో కీర్తిశేషులు విద్వాన్, ప్రముఖ రచయిత కట్టా నరసింహులు వర్ధంతిని గురువారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రచయిత బొమ్మిశెట్టి రమేష్ బుధవారం తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. సాహితీ మిత్రులు, తెలుగు భాష అభిమానులు, కళాకారులు ,కవులు, రచయితలు, చరిత్రకారులు, విద్యార్థులు, ప్రజలు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



షూటింగ్‌లో చిత్ర యూనిట్ సభ్యులు

పులివెందులలో 'రిచ్ కిడ్' చిత్రీకరణ

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పులివెందుల పట్టణంలో రిచ్ కిడ్ సినిమా షూటింగ్ జరుగుతుండడంతో ప్రజలు చూసేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా మా ఊరి సినిమా ప్రొడ్యూసర్ మంజునాథ్ రెడ్డి (బుల్ రెడ్డి) రిచ్ కిడ్ సినిమాలో మెయిన్ లీడ్‌లో నటిస్తున్నాడు. డైరెక్టర్‌లుగా షఫీ, అనిల్ వ్యవహరిస్తున్నారు. కెమెరామెన్ మల్లి, ధర్మ ల ఆధ్వర్యంలో ఈ సినిమా చిత్రీకరిస్తా ఉన్నారు. బుధవారం ఈ సినిమాలోని సన్నివేశంలో భాగంగా ఫైట్ సీన్లు చిత్రీకరించారు. ఈ సందర్భంగా మంజునాథ రెడ్డి (బుల్ రెడ్డి) మాట్లాడుతూ గతంలో మా ఊరి సినిమా పులివెందుల నియోజకవర్గంలోనే తీసి ఆ సినిమాకు మంచి పేరు వచ్చింది అన్నారు. ఇప్పుడు రిచ్ కిడ్ సినిమా పూర్తి అయిపోయిందన్నారు. తొందర్లోనే ఈ సినిమాను రిలీజ్ చేస్తామన్నారు. ఈ సినిమాలో ప్రత్యేక సన్నివేశంలో రాజక్కగా విలన్ క్యారెక్టర్ పులివెందుల బిడ్డ అమ్ములు నటించిందన్నారు. అమ్ములు తన పాత్రలో ఒదిగిపోయారని చెప్పారు. పులివెందుల ప్రాంతంలో ఎంతోమంది కళాకారులు ఉన్నారన్నారు. వారందరి కలలు బైటికి తీయడమే లక్ష్యంగా సినిమాలు తీస్తున్న అన్నారు. తొందరలోనే మరొక సినిమా తీయబోతున్నట్లు ఆయన తెలిపారు. టీమ్ మెంబర్లుగా వినయ్, జయపాల్ , ఖాసీం లు, ఉన్నారన్నారు. ఈ సినిమాలో రైతుబిడ్డ హరి, మాచిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పఠాన్, రాఘవేంద్రారెడ్డి, మురళి, మురళీధర్ నటిస్తున్నట్లు ఆయన తెలిపారు.

హార్టికల్చర్ హబ్‌గా మార్చడమే లక్ష్యం

ప్రజాశక్తి- సింహాద్రిపురం

జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మండల వ్యవసాయ శాఖ అధికారి శివమోహన్‌రెడ్డి, ఎంపిడిఒ కృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం ఎంపిడిఒ సభా భవనంలో హార్టికల్చర్, రెవెన్యూ, ఎన్ఆర్ఇజిఎస్ శాఖల అధికారులతో పండ్ల తోటల పెంపకం పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం 25 రకాల పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం అందిస్తుందని చెప్పారు. ఎంపిడిఒ కృష్ణమూర్తి మాట్లాడుతూ రైతులు పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి చూపాలన్నారు. ఈనెల 16 నుంచి ఆయా గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తాన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ చట్టం ఎపిఒ జయ భారతి, ఇసి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ముద్దనూరు : పండ్ల తోటలు పెంపకం సాగు చేసేందుకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఎంపిడిఒ ముకుంద రెడ్డి సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉద్యాన, వ్యవసాయ శాఖ, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ 2025–2026 ఆర్థిక సంవత్సరానికి గాను ఉద్యాన తోటలు పెంపకానికి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. 5 ఎకరాలు ఉన్న సన్న, చిన్నకారు రైతు కుటుంబాలకు ఉపాధి ద్వారా లబ్ది కలుగుతుందన్నారు. 5 ఎకరాలు పైన ఉన్న రైతు కుటుంబాలకు ఉద్యాన శాఖ ద్వారా లబ్ది చేకూరుతుందని ఎంపిడిఒ తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.